RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 124 | జూన్ 02 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 124 | JUN 02 Tuesay 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


ఏపీ నాయకులతో నే కొట్లాట 2

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తున్నాయన్న తరుణంలో, అక్కడ మళ్లీ ఉద్రిక్తతలు ఒక్కసారిగా రాజుకున్నాయి. అమెరికా సైనిక దళాలు ఇరాన్‌లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని వ్యూహాత్మక సైనిక లక్ష్యాలపై మెరుపు దాడులు చేయడంతో ఈ ప్రాంతం మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. తమ అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడంతో పాటు, ఇరాన్ నిరంతరం సాగిస్తున్న దుందుడుకు చర్యలకు బుద్ధి చెప్పడానికే ఈ దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా స్పష్టం చేసింది. ఈ ఆత్మరక్షణ దాడుల్లో ఇరాన్‌కు చెందిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్‌తో పాటు రెండు అటాక్ డ్రోన్లను పూర్తిగా ధ్వంసం చేశామని, వీటి వల్ల తమ యుద్ధ నౌకలకు తీవ్ర ముప్పు పొంచి ఉందని అమెరికా వెల్లడించింది.

➤ మిగతా 2వ పేజీలో..

# రెండో ఇండ్లకు శ్రీకారం

**ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి**



**ఆదిలాబాద్ జనసంఘర్షణ :**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి మరియు ఆదివాసీల సొంతింటి కల సాకారం చేయడానికి తమ ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పరిధిలోని కొత్తగూడలో కోలామ్ ఆదివాసీల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన లక్ష ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఈ ఆదివాసీ గూడెం నుంచే సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలో భాగంగా నూతన గృహప్రవేశం చేసిన ఆదివాసీ కుటుంబాలతో

➤ మిగతా 2వ పేజీలో..

## తగ్గని ఎండల తీవ్రత



**హైదరాబాద్ జనసంఘర్షణ**
తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఇంకా తగ్గలేదు. నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఏకంగా 8 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ఆదివారం నాటికి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటేశాయి. రాష్ట్రంలోని దాదాపు 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఎండలు మండిపోతుండగా, అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాజధాని హైదరాబాద్‌లో కూడా 41.6 డిగ్రీల వేడి రికార్డయ్యింది.
పగటిపూట నిప్పుల కుంపటిలా మారిన వాతావరణం

➤ మిగతా 2వ పేజీలో..

# భక్తుల రద్దీ సరికొత్త రికార్డు



**తిరుపతి జనసంఘర్షణ**
కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలో మే నెలలో భక్తుల రద్దీ సరికొత్త రికార్డులను సృష్టించింది. వేసవి సెలవులు, విద్యాసంస్థలకు విరామం లభించడంతో దేశవిదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో ఏడుకొండలకు తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. గడిచిన మే నెలలో ఏకంగా 25,46,168 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. కనుచూపు మేరలో ఎండలు మండిపోతున్నప్పటికీ, స్వామివారిపై ఉన్న అచంచల భక్తిశ్రద్ధలతో భక్తులు భారీ సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉండి మరీ దర్శనాలు చేసుకున్నారు. ఈ అసాధారణ రద్దీని తట్టుకునేలా టీటీడీ అప్రమత్తంగా వ్యవహరించి, కంపార్ట్‌మెంట్‌లలో వేచి ఉన్న సర్వదర్శనం భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తూ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల రద్దీకి అనుగుణంగానే మే నెలలో శ్రీవారి హుండీ ఆదాయం కూడా రికార్డు స్థాయిలో సమకూరింది. భక్తులు తమ అపారమైన భక్తిని కానుకల రూపంలో చాటుకోవడంతో స్వామివారికి రూ.120.28 కోట్ల భారీ ఆదాయం

➤ మిగతా 2వ పేజీలో..

# పవన్ కల్యాణ్‌పై పొన్నం ఆగ్రహం

**క్షమాపణ చెప్పి తెలంగాణాకు రావాలి**



**హుస్నాబాద్ జనసంఘర్షణ**
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పవన్ కళ్యాణ్ 'నవనిర్మాణ సభ' నిర్వహించ తలపెట్టడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో ఉన్న లోపాయికారీ ఒప్పందం మరియు వారి ప్రోద్బలంతోనే పవన్ కళ్యాణ్ ఈ తరహా రాజకీయ నటనకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టడమే ఆయన ఉద్దేశమా అని ప్రశ్నించారు. గతంలో తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన పవన్.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగా చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై నిరంతరం వ్యతిరేక భావజాలం ప్రదర్శిస్తూ, ఇక్కడి ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా మాట్లాడిన వ్యక్తికి హైదరాబాద్‌లో సభ నిర్వహించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల దృష్టి (దిష్టి) పడితే కోనసీమలోని కొబ్బరి చెట్లు

➤ మిగతా 2వ పేజీలో..

# సుప్రీం కోర్టులో ఐదుగురు న్యాయమూర్తులు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇటీవలే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన పేర్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కొత్త న్యాయమూర్తుల జాబితాలో బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, పంజాబ్-హర్యానా హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, మధ్యప్రదేశ్ హైకోర్టు



➤ మిగతా 2వ పేజీలో..

# భక్తుల రద్దీ సరికొత్త రికార్డు

**మొదటిపేజీ తరువాయి..** కేవలం నగదు రూపంలోనే కాకుండా భక్తులు పెద్దఎత్తున బంగారం, వెండి ఆభరణాలను కూడా హుండీలో సమర్పించారు. ఇక శ్రీవారికి మొక్కుల రూపంలో సమర్పించే తలనీలాల విషయంలోనూ గత రికార్డులన్నీ చెరిగిపోయాయి. మే నెలలో మొత్తం 12,43,063 మంది భక్తులు స్వామివారికి తలనీలాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గత ఏడాది మరియు ఐదేళ్ల క్రితం నాటి గణాంకాలతో పోలిస్తే ఈ సంఖ్య చాలా ఎక్కువ. 2024 మే నెలలో 10.65 లక్షల మంది, 2025 మే నెలలో 10.18 లక్షల మంది మాత్రమే తలనీలాలు సమర్పించగా, ఈసారి ఆ రికార్డులన్నీ బద్దలయ్యాయి. ముఖ్యంగా మే 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతిరోజు 50 వేల మందికి పైగా భక్తులు గుండు చేయించుకోగా, మే 23వ తేదీ ఒక్క రోజే అత్యధికంగా 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా తిరుమలలోని ప్రధాన కల్యాణకట్టతో పాటు మరో 11 ఉప కేంద్రాలను టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. తలనీలాలు తీసేందుకు మొత్తం 1,150 మంది సిబ్బందిని నియమించగా, అందులో 269 మంది మహిళా క్షురకులు కూడా ఉన్నారు. భక్తులు సమర్పించిన ఈ తలనీలాలను చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ వంటి అంతర్జాతీయ దేశాలకు టీటీడీ ఎగుమతి చేస్తోంది. వీటిని వేలం వేయడం ద్వారా వచ్చే ఆదాయం కూడా ఏటా పెరుగుతూ వస్తోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో తలనీలాల వేలం ద్వారా రూ.67 కోట్ల ఆదాయం రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది ఏకంగా రూ.200 కోట్లకు చేరే అవకాశం ఉందని టీటీడీ అంచనా వేస్తోంది. ఇలా హుండీ కానుకలు, తలనీలాల ద్వారా వస్తున్న భారీ ఆదాయాన్ని టీటీడీ తిరిగి భక్తుల వసతులు, సౌకర్యాల కోసమే ఖర్చు చేస్తోంది.

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**మొదటిపేజీ తరువాయి..** మరోవైపు ఈ దాడులపై స్పందించిన ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ), సిరిక్ ద్వీపంలో ఉన్న తమ టెలికాం టవర్లను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేసిందని ఆరోపించింది. దీనికి ప్రతికారంగా అమెరికా దళాలు ఏ ఎయిర్‌బేస్ నుంచి అయితే దాడులు చేశాయో, అదే బేస్‌ను లక్ష్యంగా చేసుకుని తాము కూడా క్షిపణులతో ఎదురుదాడి చేసినట్లు ఐఆర్జీసీ ఏరోస్పేస్ విభాగం ప్రకటించింది. అయితే ఆ ఎయిర్‌బేస్ పేరును ఇరాన్ బహిర్గతం చేయనప్పటికీ, అంతకు కొన్ని గంటల ముందే కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అప్రమత్తమై యాక్టివేట్ అయినట్లు తెలుస్తోంది.

వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించాలంటే ఖేష్మ్ ద్వీపంలోని ఇరాన్ మిసైల్ సిటీని నిర్వీర్యం చేయడం అమెరికాకు అత్యంత అవసరంగా మారింది. ఎందుకంటే ఇక్కడి భూగర్భ రహస్య స్థావరాలలో అంతర్జాతీయ నౌకలను టార్గెట్ చేయగల గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్ వంటి యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను ఇరాన్ మోహరించింది. వీటితో పాటు దాదాపు 800 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేధించగల ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ వంటి శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులను, శరవేగంతో దూసుకెళ్లే స్పీడ్‌బోట్లను మరియు తీరప్రాంత క్షిపణి బ్యాటరీలను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

## తగ్గని ఎండల తీవ్రత

**మొదటిపేజీ తరువాయి..** సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అయితే ఈ అకాల వర్షం రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆదిలాబాద్ జిల్లా మార్కెట్ యార్డులో రైతులు విక్రయానికి తెచ్చిన జొన్నలు వర్షానికి తడిసి ముద్దవగా, మంచిర్యాల జిల్లాలో బలమైన గాలుల కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. దీంతో చేతికందివచ్చిన పంట పాడైపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ కొంత ఊరటనిచ్చే వార్త చెప్పింది. రాబోయే పది రోజుల్లో, అంటే జూన్ 10 నుంచి 12వ తేదీల మధ్య నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళ, తమిళనాడు ప్రాంతాల్లో రుతుపవనాల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న నాలుగు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు తగ్గుముఖం పడతాయని, జూన్ మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

## నేడు తెలంగాన ఆవిర్భావ దినోత్సవం

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు**

**ట్రాఫిక్ ఆంక్షలు విధించిన పోలీసులు**

**హైదరాబాద్, :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో నేడు ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేడుకల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని మల్కాజ్ గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మద్యాహ్నం12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్ పల్లి వైపు వెళ్లేవారు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోలని ఈ సందర్భంగా సూచించారు. రోడ్లపై పార్కింగ్ చేయరాదని చెప్పారు. వేడుకల్లో ప్రభుత్వ కార్యవర్గంతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి ప్రజానీకం పాల్గొంటున్న సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నట్లు

# పవన్ కల్యాణ్‌పై పొన్నం ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి..** ఎండిపోతాయని గతంలో పవన్ కళ్యాణ్ వివాదాస్పదవ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలపై ఆయన తక్షణమే రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆనాడు తెలంగాణపై అంతగా విషం చిమ్మిన పవన్.. ఇప్పుడు ఇక్కడి ప్రజలకు సమాధానం చెప్పిన తర్వాతే నవనిర్మాణ సభ గురించి ఆలోచించాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అదే రోజున హైదరాబాద్‌ను లక్ష్యంగా చేసుకుని సభ పెట్టడం వెనుక రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టే కుట్ర దాగి ఉందన్నారు. ఈ నవనిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళ వంటి ఇతర రాష్ట్రాల్లో కాకుండా కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో, కేవలం బీజేపీ పెద్దలను మెప్పించడానికే ఈ ప్రయత్నాలా అని నిలదీశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్‌ను నమ్మి పెద్ద ఎత్తున గెలిపించి అధికార బాధ్యతలు అప్పగించారని, కాబట్టి ఆయన ముందుగా ఏపీలోని సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి అత్యంత కీలకమైన అంశాలపై పోరాటం చేయకుండా, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోకి వచ్చి రాజకీయాలు చేయడం ఏ రకమైన విధానమని ప్రశ్నించారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకుని, ఇప్పుడు బీజేపీ ఎజెండాను మోస్తున్న పవన్ కళ్యాణ్ ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

## సుప్రీం కోర్టులో ఐదుగురు న్యాయమూర్తులు

**మొదటిపేజీ తరువాయి..**చీఫ్ జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరితో పాటు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన కూడా నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఈ ఐదుగురి నియామకంతో సుప్రీంకోర్టులో మొత్తం జడ్జీల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నియామకాల్లో సీనియర్ న్యాయవాది వి. మోహన ఎంపిక అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ జాబితాలో బార్ అసోసియేషన్ (న్యాయవాద వృత్తి) నుంచి నేరుగా అత్యున్నత న్యాయస్థానానికి ఎంపికైన ఏకైక వ్యక్తి ఆమెనే కావడం విశేషం. జస్టిస్ ఇందు మల్హోత్రా తర్వాత బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన రెండో మహిళా న్యాయవాదిగా ఆమె సరికొత్త రికార్డు సృష్టించారు. 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి ఐదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థినిగా న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్న మోహనకు న్యాయరంగంలో అపారమైన అనుభవం ఉంది. ఆమె కెరీర్ ఆరంభంలో సుప్రీంకోర్టు ప్రముఖ సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్ వద్ద జూనియర్‌గా పనిచేశారు. ఆ తర్వాత 1996లో ప్రతిష్ఠాత్మక ఏఓఆర్ (అడ్వకేట్ ఆన్ రికార్డ్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, ఢిల్లీ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. తన సుదీర్ఘ ప్రస్థానంలో కపిల్ సిబల్, కేకే వేణుగోపాల్, పి. చిదంబరం, అరుణ్ జైట్లీ, అంద్యార్జున వంటి దేశంలోని దిగ్గజ సీనియర్ న్యాయవాదులతో కలిసి పలు కీలక కేసుల్లో పనిచేశారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా 2015 ఏప్రిల్ 23న సుప్రీంకోర్టు ఆమెకు 'సీనియర్ న్యాయవాది' హోదాను కల్పించింది. కాగా, వి. మోహన నియామకంతో సుప్రీంకోర్టులో మహిళా జడ్జీల ప్రాతినిధ్యం మరింత బలోపేతమైంది.

## ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

**పేచీ కేవలం అక్కడి నాయకులతోనే**

**ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం**

**పవన్ కళ్యాణ్‌కు టిఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక**

హైదరాబాద్, : ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు. ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు.

టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# రెండో ఇండ్లకు శ్రీకారం

**మొదటిపేజీ తరువాయి..** కలిసి ముఖ్యమంత్రి ఇప్పపువ్వు లడ్డు తిని సంబరాల్లో పాలుపంచుకున్నారు. అలాగే గృహప్రవేశం చేసిన ఆడబిడ్డలకు పట్టుబట్టలు బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని గుర్తుచేశారు. అయితే, ఈ కేటాయింపుల ద్వారా గూడేలు, తండాల్లోని ఆదివాసీలందరికీ న్యాయం జరగదన్న విజ్ఞప్తుల మేరకు.. సాధారణ కోటాతో సంబంధం లేకుండా ఆదివాసీ ప్రాంతాల కోసం ప్రత్యేకంగా 21 వేల అదనపు ఇళ్లను మంజూరు చేసినట్లు ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా మార్చడమే తన సంకల్పమని, ఇందుకోసం అర్హులైన ఆదివాసీల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇదే వేదికపై నుంచి రెండో విడత కింద రాష్ట్రంలో మరో 2.50 లక్షల కొత్త ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. ఇందులో మొదటి ప్రాధాన్యత తండాలు, గూడేలలోని గుడిసెల్లో నివసించే పేదలకే ఉంటుందని, రాబోయే సెప్టెంబర్ 17 నాటికి రాష్ట్రంలో మరో లక్ష గృహప్రవేశాలు చేయిస్తామని సీఎం స్పష్టం చేశారు.

ఇదే సమయంలో అంతకుముందు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలకుల నిర్వాకం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టుపై పెట్టిన రూ. లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలు కావడమే కాకుండా, ఆదిలాబాద్‌లోని స్థానిక ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి తీరుతుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రికి తాను స్వయంగా లేఖ రాసినా అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని, తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్నచూపో అర్థం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా అని ప్రశ్నించిన ఆయన, తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కోసం తాము మహారాష్ట్రను కేవలం 2 వేల ఎకరాల భూమిని మాత్రమే అడుగుతున్నామని, దానివల్ల వారికి జరిగే నష్టాన్ని కూడా భరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ అంతరాష్ట్ర సమస్యల పరిష్కారానికి కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై స్పందిస్తూ, రాష్ట్రంలో ఇప్పటివరకు 62 లక్షల క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేశామని, జూన్ 15 నాటికి మొత్తం 75 లక్షల క్వింటాళ్ల కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని సీఎం వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, ఇందుకు కిషన్‌రెడ్డి సహకరించాలని కోరారు. ఒకవేళ కేంద్రం ధాన్యం సేకరించకపోతే జూన్ 15 తర్వాత కేంద్ర ప్రభుత్వంపై ప్రత్యక్ష యుద్ధానికి దిగుతామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రూ.112.14 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో చింతలమానేపల్లిలో నిర్మించనున్న 132/3 కేవీ సబ్‌స్టేషన్ పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావుతో పాటు స్థానిక కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా పట్టివేత

**11మంది నిర్వాహకుల అరెస్ట్**

**హైదరాబాద్, :**

తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై సీఐడీ చీఫ్ చారు సిన్హా ఆధ్వర్యంలో కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భారీ నెట్‌వర్క్ కార్యకలపాలను బట్టబయలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ గేమింగ్ మాఫియాపై చేపట్టిన ఈ చర్యల్లో మొత్తం 11 మంది నిర్వాహకులను అధికారులు అరెస్టు చేశారు. వీరిలో తెలంగాణకు చెందినవారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కూడా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని సీఐడీ చీఫ్ చారుసిన్హా వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులను సీఐడీకి బదిలీ ఆయిన కేసులను విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కేసు పూర్తి వివరాలను చారుసిన్హా మీడియాకు వెల్లడించారు. కరీంనగర్‌లో నమోదైన డాఫా బెట్ కేసును ఛేదించామని తెలిపారు. 46 మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్‌ను సీజ్ చేశామని చెప్పుకొచ్చారు. ఈ కేసులో ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ఆర్గనైజర్లు రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షలు సంపాదిస్తున్నారని అన్నారు. 40 మంది అధికారులు ఈ కేసును విచారణ చేశారని

# ఇల్లందు నియోజకవర్గంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాలు

ఇల్లందు జూన్ 1 (జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'లక్ష ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశం' కార్యక్రమం ఇల్లందు నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. ఇల్లందు టౌన్, ఇల్లందు మండలం, టేకులపల్లి, గార్ల, బయ్యారం మండలాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాల కార్యక్రమానికి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మర్రిగూడెం, గార్ల, సంతులాల్ బోడుతండా, చల్లసముద్రం, టేకులపల్లి, గోలియా తండా, బేతంపుడి తదితర గ్రామాల్లో లబ్ధిదారులతో కలిసి ఆయన స్వయంగా గృహ ప్రవేశాలు చేయించారు.

**వాహనాలు ఉన్నా ఇళ్ళు ఇస్తాం.. గత ప్రభుత్వంపై ఎమ్మెల్యే కనకయ్య విమర్శలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ళు తప్ప, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వంటి వాహనాలు ఉన్నప్పటికీ, అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్ళు అందిస్తామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.



**కార్యక్రమంలో భారీగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు**

ఈ గృహ ప్రవేశాల కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు పురపాలక చైర్మన్, వైస్ చైర్మన్ దొడ్డా కిరణ్, మిత్ర డానియల్, పెండేల రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ బొడా మంగిలాల్, సొసైటీ చైర్మన్లు వడ్లముడి దుర్గా ప్రసాద్, మూల మధుకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ సుందర్, బోళ్ళ సూర్యం, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 15వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ

- తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకూ అందజేత

ఇల్లందు జూన్ 1 (జన సంఘర్షణ)





మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ఘనంగా ప్రారంభమైంది. గత మూడు రోజుల క్రితమే డ్వాక్రా గ్రూప్ మహిళలకు విజయవంతంగా చీరలను పంపిణీ చేసిన అధికారులు, తాజాగా వార్డులోని మిగతా అర్హులైన మహిళలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. వార్డు పరిధిలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి మహిళకు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ఈ ఇందిరమ్మ చీరలను అందజేస్తున్నట్లు ప్రకటించారు. వేసవి కాలంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ కానుక పట్ల స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ సోనీ సుదర్శన్ కోరి, 20వ వార్డు కౌన్సిలర్ ఎమ్.డి. జాఫర్ , ఆర్.పి. లీలా, ఓ.బి. సోనమ్ తివారి, చంద్రమ్మ, సుమిత్ర కోరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సొసైటీ కాలేజీ ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, రాంబాబు, సి.టి. కేబుల్ చందు ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# బీఆర్ఎస్ శ్రేణులకు తెలంగాణ అవతరణ దినోత్సవ ఆహ్వానం

ఇల్లందు జూన్ 1 (జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇల్లందు నియోజకవర్గంలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు ఘనమైన ఆహ్వానం అందింది. జూన్ 2వ తేదీన జరగబోయే ఈ వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు.

**కేటీఆర్ ఆదేశాలతో ఘనంగా పతాకావిష్కరణలు**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, గౌరవనీయులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆదేశానుసారం ఈ వేడుకలను నిర్వహించనున్నారు. జూన్ 2న ఉదయం నుంచే నియోజకవర్గంలోని ముఖ్య కేంద్రాలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలను షెడ్యూల్ చేశారు.

**సమయం - వేదికల వివరాలు**

నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. జూన్ 2వ తేదీ మంగళవారం ఉదయం 8:00 గంటలకు కరెంటు ఆఫీస్ సెంటర్ వద్ద మొదటి కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత ఉదయం 8:30 గంటలకు జేకే కాలనీ వద్ద గల ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యాలయం నందు జెండా ఆవిష్కరిస్తారు.

**తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వేడుకలు**

కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9:00 గంటలకు స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు బీఆర్ఎస్ శ్రేణులు చేరుకుంటారు. అక్కడ తెలంగాణ తల్లికి నివాళులు అర్పించి, అత్యంత ఘనంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.




**కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని హరిప్రియ పిలుపు**

ఈ కార్యక్రమానికి ఇల్లందు పట్టణ, మండల పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులంతా కలిసికట్టుగా పాల్గొని ఈ అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

# అన్నపురెడ్డిపల్లి మండలంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి జూన్ 1 (జన సంఘర్షణ)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ వారోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిల మార్గదర్శకత్వంలో నిరుపేదలకు గృహ వసతి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు, అన్నపురెడ్డిపల్లి మండలం పెద్దిరెడ్డిగూడెం గ్రామంలో లబ్ధిదారులు ఘనంగా గృహప్రవేశాలు చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు వేముల రమణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేముల నరేష్‌ల సమక్షంలో లబ్ధిదారుల కుటుంబాలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నూతన గృహాల్లోకి అడుగుపెట్టాయి. ఈ సంబరాల్లో స్థానిక సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ కమిటీ ప్రతినిధులు, కిసాన్ సెల్ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు సొంతింటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్దిరెడ్డిగూడెం గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# సింగరేణి నీటి సమస్యపై 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ వినతి

ఇల్లందు జూన్ 1 (జన సంఘర్షణ)

మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు మసీద్ లైన్, రామాలయం వెనుక లైన్ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. నీరు రాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంచినీటిని సరఫరా చేయాలని కోరుతూ 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ సోమవారం సింగరేణి 24 ఏరియా సివిల్ సూపర్వైజర్ మహేష్‌కు వినతి పత్రం అందజేశారు.



**ఐదు రోజులుగా నిలిచిన సరఫరా.. వేసవిలో ప్రజల అవస్థలు**

ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. మస్జిద్ లైన్, రామాలయం వెనుక లైన్ ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయి సుమారు ఐదు రోజులు కావస్తుందని తెలిపారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో తాగునీరు లేక స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు అనేక అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**స్పందించి ఇబ్బందులు తీర్చాలని సింగరేణి అధికారులకు విన్నపం**

ఎండ తీవ్రత దృష్ట్యా సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కౌన్సిలర్ కోరారు. యుద్ధప్రాతిపదికన మంచినీటి సరఫరాను పునరుద్ధరించి, ప్రజల నీటి ఇబ్బందులను శాశ్వతంగా తీర్చాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# చర్ల రక్షక భటనిలయ అధికారులకు దక్కిన గౌరవం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 01(జనసంఘర్షణ ):

చర్ల పోలిస్టేషన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆలెం రాజువర్మకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక శౌర్య పథక అవార్డు ప్రకటించడం జరిగింది. ఏజెన్సీ ప్రాంతంలో మావోయిజం అణచి వేయడంతో పాటు శాంతిభద్రతలను అదుపులో ఉంచడం, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో మండల ప్రజలకు పోలీస్ శాఖ నుప్రజలకు దగ్గర చేయడంలో రాజు వర్మ చేసిన కృషి అద్భుతం, చర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజువర్మకి సౌర్య పథకం, సబ్ ఇన్స్పెక్టర్ కేశవ్‌కి కఠిన సేవా, పోలీస్ కానిస్టేబుల్ రాముకి కఠిన సేవా, హెడ్ కానిస్టేబుల్ రాంబాబుకి కఠిన సేవా పథకాలు దక్కాయి. వీరందరికీ చర్ల మండల ప్రజలు అందరు హృదయపూర్వక అభినందనలు తెలిపినారు.



# భగవద్గీతలో అసాధారణ ప్రతిభ, మైసూరు దత్తపీఠం స్వర్ణ పతక విజేత గీతికాశ్రీరెడ్డి

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు,జూన్ 01, (జన సంఘర్షణ) :

చిన్న వయస్సు, అపారమైన ఏకాగ్రత, ఆధ్యాత్మిక చింతనతో భగవద్గీతలోని సర్వ శ్లోకాలను ఆకళింపు చేసుకుని, మైసూరు దత్తపీఠం నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది పఠాన్‌చెరువు నివాసి, బాలమేధావి సారెడ్డి గీతికాశ్రీరెడ్డి. ప్రస్తుతం 'అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్' బీరంగూడలో 9వ తరగతి చదువుతున్న గీతిక, తన అసాధారణ జ్ఞాపకశక్తితో అందరినీ ఆశ్చర్యపరిచింది. గురువు ప్రోత్సాహం.. అంకితభావం గుంటూరుకు చెందిన ఉపాధ్యాయురాలు ప్రసన్న, జూమ్ వేదిక ద్వారా అన్ని వయస్సుల వారికి ఉచితంగా భగవద్గీత బోధిస్తున్నారు. ఈ క్రమంలో గీతికను ప్రోత్సహించి, ఆచిన్నారికి భగవద్గీతలోని శ్లోకాలన్నింటినీ కంఠస్థం చేయించారు. ఉపాధ్యాయురాలు ప్రసన్న అందించిన మార్గనిర్దేశనం, గీతిక కఠోర శ్రమకు తోడవ్వడంతో ఆమె భగవద్గీతలో ప్రావీణ్యం సంపాదించింది. మైసూరు దత్తపీఠంలో విజయదుందుభి మైసూరు దత్తపీఠం నిర్వహించిన వివిధ పోటీల్లో గీతిక పాల్గొని, వరుసగా ఆరుసార్లు ప్రథమ విజేతగా నిలిచి ఫైనల్ గా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ను ఈ ప్రతిష్టాత్మక వేదికపై పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి నుంచి సర్టిఫికెట్ అందుకుని వారి ఆశీస్సులు పొందింది. ఏ శ్లోకాన్ని ఎక్కడ అడిగినా తడుముకోకుండా చెప్పగల గీతిక ప్రతిభను చూసి పీఠాధిపతులు, భక్తులు ప్రశంసల వర్షం కురిపించారు.గీతిక తండ్రి సారెడ్డి కోటిరెడ్డి సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. తమ కుమార్తె చదువుతో పాటు ఆధ్యాత్మికంగా కూడా ఇంతటి గుర్తింపు పొందడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే భగవద్గీతలోని సారాన్ని అర్థం చేసుకుని, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవర్చుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో గీతిక మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు అభినందిస్తున్నారు.



# తెలంగాణ ఇసుక మహారాష్ట్రకు తరలింపు

- ఇసుక తవ్వకాలు చేస్తున్నారని స్థానికుల ఆరోపణ

నిజామాబాద్ జిల్లా,సాలూర్:జూన్ 01( జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా సాలూరు మండల కేంద్రం తగ్గెల్లి సమీపంలోని మంజీరాలో మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు తెలంగాణ భూభాగంలోకి చొరబడి అక్రమంగా ఇసుక త్రవ్వకాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు, రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా అక్రమంగా ఇసుక మహారాష్ట్రకు తరలిస్తున్నారని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. జెసిబిలతో ఇసుకను తవ్వి మహారాష్ట్రలోకి తరలించి టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు, భారీ గుంతలు ఏర్పడుతున్నాయని ఈ వ్యవహారంపై కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ జరిపి తొందరగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# సుభాష్ నగర్ కాలనీ సమస్యలపై సర్పంచ్ పూనెం కృష్ణకు వినతి

భద్రాచలం జూన్ 1 (జన సంఘర్షణ)
భద్రాచల పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏడవ వార్డు మెంబర్ కావూరి గోపి సోమవారం భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచ్ గారి దృష్టికి తీసుకెళ్లి, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

**సర్పంచ్ పూనెం కృష్ణ దృష్టికి వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు**

కాలనీలోని ప్రధాన సమస్యలను సర్పంచ్ పూనెం కృష్ణకి వివరిస్తూ.. సుభాష్ నగర్ కాలనీలో వీధి స్తంభాలు, వీధి దీపాల సమస్య తీవ్రంగా ఉందని వార్డు మెంబర్ పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల కాలనీవాసులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారని సర్పంచ్‌కి వివరించారు.

**వర్షకాలం దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌కి విన్నపం**

రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీలో ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీలను శుభ్రం చేయించాలని సర్పంచ్ పూనెం కృష్ణని కోరారు. వర్షపు నీరు నిలవకుండా మురుగునీటి కాలువల వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సర్పంచ్‌కి విజ్ఞప్తి చేశారు.

**శానిటైజేషన్ పనులు చేపట్టాలని సర్పంచ్ పూనెం కృష్ణకు వినతి**

గత మూడు నెలల నుంచి కాలనీలో శానిటైజేషన్ వంటి పనులు పూర్తిగా నిలిచిపోయాయని వార్డు మెంబర్ కావూరి గోపి సర్పంచ్ పూనెం కృష్ణ దృష్టికి తెచ్చారు. దోమల నివారణకు, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ కాలనీ వ్యాప్తంగా బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, ఫాగింగ్ వంటి శానిటైజేషన్ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సర్పంచ్‌ని కోరారు.



**కార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు**

సర్పంచ్ పూనెం కృష్ణకి వినతి పత్రం అందజేసిన వారిలో వార్డు మెంబర్‌తో పాటు బి.ఆర్.ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కె. ప్రేమ్ కుమార్, దుమాల రాజేశం, మారెడ్డి గణేష్, ప్రవీణ్ కుమార్, రాంబాబు, సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ సమస్యలపై సర్పంచ్ సానుకూలంగా స్పందిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పుట్టా నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో బేరి రామచంద్ర యాదవ్‌కు, ఉద్యమకారులకు ఘన సన్మానం

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):
శేరిలింగంపల్లి ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ పోరుబాట చేపట్టిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరీ రామచంద్ర యాదవ్ తో పాటు ఉద్యమకారులను ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు పొట్ట నరేందర్ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో నల్లగండ్ల బ్రిడ్జ్ ఐసిఐసిఐ బ్యాంక్ వద్దగల ఫంక్షన్ హాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఉద్యమకారులకు ఘనంగా సన్మానించడం జరిగింది. శాలువాలతో ఉద్యమకారులకు మెంమోంటోలతో ప్రతి ఒక్కరికి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన ఉద్యమకారుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం తగిన గౌరవం అందించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని రెండు వందల యాభై గజాలు ఇంటి స్థలం, గుర్తింపు పత్రం ఇవ్వాలని ప్రభుత్వానికి సభాముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వెంకట్ రెడ్డి, మల్లికార్జున శర్మ నవత రెడ్డి మల్లేష్, ఆర్కే సాయన్న ముదిరాజ్, సంతోష్, గోవిందు చారి, నరసింహ చారి, ఉద్యమకారుల గురించి ప్రసంగించి ఉద్యమకారులకు



న్యాయం జరగలేదని న్యాయం చేయాలని విన్నవించారు. ముఖ్యంగా పురుషోత్తం యాదవ్ తన సందేశంలో ఏ ప్రభుత్వాలు అయినా ఏ పార్టీ అయినా తెలంగాణను సాధించిన ఉద్యమకారులకు మర్యాదపూర్వకంగా చూస్తూ న్యాయం చేయాలని కోరుతున్నామని చెప్పారు. ఉద్యమకారులు కొంతమంది 1969 లోనూ 2001 నుండి 2014 వరకు ఉదృత ఉద్యమము చేసి కేసీఆర్ జయశంకర్ నాయకత్వంలో తెలంగాణ సాధించడం జరిగింది 1200 మంది ప్రాణాలను బలి ఇవ్వడమే కాకుండా 1969లో కూడా 370 మంది ప్రాణ త్యాగం చేయడం జరిగింది . 1949 నుండి 1953 ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ నిజాం నుండి విముక్తి కావాలని 1969 నుండి 1973 వరకు ఆంధ్ర వాళ్ళ నుండి విముక్తి కావాలని అదేవిధంగా 2001 నుండి 2014 వరకు సుదీర్ఘంగా పోరాటం చేసి ఉదృతంగా కేసీఆర్,జయశంకర్ నాయకత్వంలో సలహాలతో ఉద్యమించి రాష్ట్ర వ్యాప్తంగా కులాలకు మతాలకు అన్నింటికీ అతీతంగా పోరాడి తెలంగాణ సాధించుకోవడం జరిగిందన్నారు. నరేందర్ యాదవ్ తన సందేశంలో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగలేదు, కాబట్టి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి వేసిన కమిటీ ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలని సభాముఖంగా కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా 1969, 2001, 2014 ఉద్యమంలో పాల్గొన్న ఆర్కే సాయన్న ముదిరాజ్ మాట్లాడుతూ ఉద్యమకారులకు న్యాయం చేయాలని టిఆర్ఎస్ ప్రభుత్వం కానీ తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం కానీ తెలంగాణ సాధించినందుకు గుర్తింపుగా సంపూర్ణ స్వాతంత్రం కొరకు ఉద్యమించినందుకు న్యాయం చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో సంతోష్ మిగతా వాళ్ళు కూడా ప్రసంగించారు. అందరు కూడా ఉద్యమకారులకు న్యాయం జరగాలని కోరడం జరిగింది. సామ వెంకట్ రెడ్డి వందన సమర్పణలతో సమావేశం ముగించారు. శేరిలింగంపల్లి ఉద్యమకారులు అందరు పాల్గొని సన్మాన సభను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లికార్జున శర్మ, బేరి రామచంద్ర యాదవ్, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, ఉద్యమ నాయకురాలు మమత, బాలరాజు, మల్లారెడ్డి, సామ వెంకట్ రెడ్డి, అందెల సత్యనారాయణ యాదవ్, పాశం రాజు యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, ఉద్యమకారులు అందరు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఐపీఎల్ ఫైనల్ చూస్తూ డ్రైవింగ్.. బావిలోకి దూసుకెళ్లిన కారు

జగిత్యాల్/జూన్ 1/(జన సంఘర్షణ)





ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ చూస్తూ యువకులు కార్ డ్రైవ్ చేశారు. ఆ కారు బావిలోకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందారు.దేశంలో ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. నిత్యం కోట్లాది మంది ఐపీఎల్ మ్యాచ్‌లను చూశారు. ఇక ఫైనల్ మ్యాచ్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. అయితే మ్యాచ్ చూస్తూ కారు డ్రైవ్ చేయడంతో యువకులు ప్రమాదం బారిన పడ్డారు.డ్రైవింగ్? చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. అయినా కూడా చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఫోన్ మాట్లాడుతూ.. కార్లలో సినిమాలు చూస్తూ డ్రైవింగ్ చేస్తుంటారు. తాజాగా జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి వద్ద ఓ కారు అదుపు తప్పి బావిలోకి దూసుకెళ్లింది. ఒకరి మృతి. నివేష్, అశ్విన్, అరుణ్ అనే ముగ్గురు యువకులు థార్ వాహనంలో మొబైల్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ చూస్తూ ప్రయాణించారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న జగిత్యాలకు చెందిన అరుణ్ బావిలో మునిగి మృతి చెందగా.. నివేష్, అశ్విన్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు రెండు గంటలు శ్రమించి అరుణ్ మృతదేహాన్ని, కారును బయటకు తీశారు. ఈ ఘటనతో యువకుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

# వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీని జగిత్యాల ప్రాంతంకు తరలింపు చేస్తే ఊరుకునేది లేదు

❑ 40 సీట్‌లను 80కి పెంచినందుకు, వ్యవసాయం మంత్రికి అభినందనలు.




నిజామాబాద్ జిల్లా,రుద్రూర్ : జూన్ 01( జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం. అక్బర్ నగర్ గ్రామ పంచాయితీ పరిధిలో గల వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీని జగిత్యాల ప్రాంతమునకు తరలింపు రద్దు విషయంలో సహకరించిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ శాసనసభ్యుల పోచారం శ్రీనివాస్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞత తెలపడం జరిగింది. ప్రస్తుతం కళాశాలలో గల 40సీట్ల సంఖ్య పరిమితిని పెంచుతూ 80 సీట్లను ఏర్పాటు చేసినందుకుగాను గ్రామస్తులు విద్యార్థులు మండల, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్బర్ నగర్ గ్రామ సర్పంచ్ ముదునూరి సీతారామరాజు, జహీరాబాద్ పార్లమెంటరీ దిశా సభ్యులు నడిపింటి నగేష్, మాజీ సర్పంచ్ రామ గౌడ్, ఉప సర్పంచ్ శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాయిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రజాక్, కాంతారావు, థామస్, టీవీ లక్ష్మణ్, మహమ్మద్, ఫాహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐకేపీ ఓఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నిరవధిక సమ్మె

నిజామాబాద్ జిల్లా,రుద్రూర్, జూన్ 01( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం వోల్ మజ్జపు తెలిపిన బిజెపి నాయకులు మండల అధ్యక్షుడు హరికృష్ణ. కటికే రాజు, వచ్చేనెల సందర్శన చేయు సీతక్క,కోటగిరి మండలానికి మంత్రి సీతక్క వస్తుంది డిమాండ్స్ తీరని వెడల కచ్చితంగా అడ్డుకుంటామని బిజెపి నాయకులు తెలిపారు, వోల్ లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి. వోల్ లకు సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం 20 లక్షలు కల్పించాలి, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హృదయ పాలసీ వర్తింపజేయాలి, ట్యాబ్ నెట్ సౌకర్యం కల్పించాలి, అర్హులైన వోల్ లకు సీసీ లుగా పదోన్నతి కల్పించాలి, 58 జి .ఓ ను సవరించాలి. ఉద్యోగ భద్రత పని భారం తగ్గించాలి. వీరి చిన్న చిన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, రుద్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ అధ్యక్షతన ఇందూరు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ఆదేశాల మేరకు ఐకేపీ ఓఎస్ చేస్తున్న సమ్మెకు బీజేపీ పార్టీ పూర్తి మద్దతు ఇవ్వడం జరిగింది. మంత్రి సీతక్క 2023 లో వోల్ కోసం అసెంబ్లీలో మాట్లాడిన సీతక్క ఇప్పుడు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా ఉండి కూడా వోల్ పట్ల పక్షపాతం చూపడం అన్యాయమని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీరి డిమాండ్లను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని రుద్రూర్ మండల బిజెపి కమిటీ తరుపున రాష్ట్ర ప్రభుత్వన్ని హెచ్చరిస్తా ఉన్నాము. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి కటిక రామరాజు, ప్రధాన కార్యదర్శి వడ్ల సాయినాథ్ మండల ఉపాధ్యక్షులు బేగరి వినోద్ కుమార్,రేపల్లి సాయిప్రసాద్,యువ మోర్చా అధ్యక్షులు కుమ్మరి గణేష్, కార్యదర్శి ఎర్రోళ్ల శ్రీనివాస్, కేవీడీ సాయిలు, మండల సీనియర్ నాయకులు వరప్రసాద్ , కళ్యాణి, నాగారం చిన్న సాయిలు, ధర్మవరశీవెంకటేష్, ఈశ్వర్, నితిన్, నారోజు శ్రీనివాస్, దామోజీ నవీన్, మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# ఈటల రాజేందర్‌పై దుష్ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

❑ కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు.



హైదరాబాద్ సిటీ, మేడ్చల్ -మల్కాజిగిరి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):
మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేసే దుండగులు కూకట్‌పల్లి, మారేడ్‌పల్లి, శామీర్‌పేట ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్‌లోని ఈటల నివాసం వద్ద అవాస్తవాలతో కూడిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయడాన్ని భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు మాధవరం కాంతారావు తీవ్రంగా ఖండించారు. సోమవారం రోజు రాష్ట్ర డీజీపీకి బీజేపీ రాష్ట్ర నాయకులతో కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ 31 మే 2026 మా దృష్టికి వచ్చిన ఈ ఫ్లెక్సీలు కేవలం ఈటల రాజేందర్ వ్యక్తిగత ప్రతిష్టకే కాకుండా, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రతిష్టకు కూడా భంగం కలిగించే కుట్రపూరిత చర్య. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అపోహలు సృష్టించి, అసంతృప్తి రేకెత్తించాలనే దురుద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారు. ఇది పూర్తిగా అవాస్తవం. బీజేపీ ఒక క్రమశిక్షణ గల పార్టీ. మా ఎంపీ ఈటల రాజేందర్ నాయకత్వంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దీన్ని జీర్ణించుకోలేని కొందరు ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారు.ఈ ఘటన వెనుక ఉన్న సూత్రధారులను, పాత్రధారులను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరాము. సంబంధిత ఫోటోలు, వీడియోలను పెన్‌డ్రైవ్ రూపంలో పోలీసులకు అందజేశాము.తప్పుడు ప్రచారాలు చేసే వారిపై ఉక్కుపాదం మోపాలి. బీజేపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు. ధర్మం, న్యాయం మనవైపే ఉందాని నిజామాబాద్ జిల్లా, కూకట్పల్లి అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు అన్నారు.

# ఘనంగా క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ మేకల మైఖేల్ జన్మదిన వేడుకలు

❑ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన శేరి సతీష్ రెడ్డి, కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్.



హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):
కూకట్పల్లి నియోజకవర్గం క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ మేకల మైఖేల్ జన్మదిన సందర్భంగా ఎస్ఎస్ఆర్ క్యాంప్ ఆఫీసులో మేకల మైఖేల్ ని శేరి సతీష్ రెడ్డి శాలువాతో సన్మానించి, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, బాలాజీ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాణ్, డివిజన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ప్రజలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు



పోతంగల్/జూన్ 1/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలోని , పాత పోతంగల్ గ్రామ నివాసి గంట్ల గంగాధర్, పల్లె పండరి, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా. స్పెషల్ ఆఫీసర్ ముని నాయక్, పోతంగల్ మండల తాసిల్దార్ సందీప్, ఎంపీడీవో చందర్ నాయక్, జిపిఓ శ్రీనివాస్, ఆర్ డబ్ల్యు ఎస్ ఏయి రాము, పోతంగల్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రతాప్ , గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి ,వార్డ్ మెంబర్లు పులికంటి సాయిలు, పంచ రెడ్డి అనిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎక్స్ ఎంపీపీ గంధపు పవన్, సుదం ధనరాజ్ , గంధపు దత్తు, గంధపు రాజు, గంట్ల విట్టల్, గ్రామ ప్రజలకు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ముని నాయక్ మాట్లాడుతూ.. లబ్ధిదారులను అభినందించి వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు, అరులైన ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ పేద ప్రజల సొంతింటి కలని సహకారం చేసినందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారానే సాకారం అవుతుందని తెలిపారు.

## కెపిహెచ్బిలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ,కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):



కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు సోమవార కె.పి.హెచ్.బి డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానంగా గతంలో నిధులు మంజూరూ అయ్యి జరుగుతున్న నూతన పైపు లైనులు ,రోడ్లు పనులు ఇతర అభివృద్ధి కార్యక్రమాలని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం హయాంలో కూకట్పల్లి నియోజకవర్గం లో కేపిహెచ్.బి డివిజన్ కు వందల కోట్ల నిధులు మంజూరు చేయించి నిరుపేదలకు ఉపయోగపడేటట్లు అనేక కార్యక్రమాలు నిర్వహించుకున్నామని ఇందులో ప్రధానంగా నాలుగో ఫేస్‌లో ఉంటున్న నిరుపేదలకు ఇతర ప్రాంతాల వారికి ఉపయోగపడేటట్లుగా అత్యాధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని అడిగితే కాంగ్రెస్ నాయకుల దగ్గర తాళాలు ఉంచుకుని ఈ కమ్యూనిటీ హాల్‌కు చెత్తాచెదారం బూజులు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇదా అభివృద్ధి, నిరుపేదలకు తక్కువ రుసుముతో వారికి శుభకార్యాలు చేసుకునే విధంగా దీన్ని ఉపయోగించాలని ఉద్దేశంతో కట్టించామని,కనీసం అధికారులు కూడా కాంగ్రెస్ నాయకులకు భయపడి ఇలా ప్రజలకు ఉపయోగపడే ప్రాపర్టీలను నిర్వీర్యం చేస్తున్నారని,ఇప్పటికైనా ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. అలాగే మహిళా మండలి భవనం కూడా మహిళలకు ఉపయోగపడే విధంగా నిర్మించామని దాన్ని కూడా ఇదే స్థితిలో తీర్చిదిద్దారని ఆవేదన వ్యక్తం చేశారు.. గతంలో నిరుపేదలకు మంచినీరు ఇబ్బంది రాకుండా పైపు లైనులు వాటర్ ట్యాంకులు నిర్మించడమే కాకుండా ఉచిత మంచినీటిని అందించామని.. ఇప్పుడు నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రజలకు ఉపయోగపడే పార్కులు, సిమ్మింగ్ పూల్స్ ఇండోర్ స్టేడియంలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటే కాంగ్రెస్ నాయకులు వాటన్నింటికీ బూజు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కనీసం ప్రజల గురించి కూడా ఆలోచించడం లేదని.. తాను ఎప్పుడూ అభివృద్ధికి సహకరిస్తానని కానీ ఈ విధంగా చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్ని విభాగాల అధికారులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరి పోతంగల్ మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం


కోటగిరి /జూన్ 1/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా ఉమ్మడి మండలాలలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం స్పెషల్ అధికారి డి సి ఓ శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఆయనతోపాటు గ్రామ సర్పంచ్ మరల మధుకర్ కూడా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఇందిరమ్మ ఇంటి కల నెరవేర్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపిటిసి కొట్టం మనోహర్ అన్నారు. స్పెషల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గృహప్రవేశాలు ప్రారంభించమని అన్నారు. కోటగిరి లో 406 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 103 ఇండ్లు పూర్తి అయ్యాయని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందనరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడిన వారు ఎవరు కూడా పూరి గుడిసెలో ఉండదన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రతి నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు ఇవ్వడం జరిగిందని అన్నారు. మండలంలో ఇండ్లు లేని నిరుపేదలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, స్పెషల్ అధికారి డి సి ఓ శ్రీకాంత్ రెడ్డి, తాసిల్దార్ గంగాధర్, ఎంపీడీవో విష్ణు, హౌసింగ్ ఏఈ మహేందర్ రెడ్డి, సెక్రటరీ సందీప్, మాజీ ఎంపిటిసి కొట్ట మనోహర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల గంగాధర్ దేశయ్, మాజీ సర్పంచ్ బీర్కూర్.గంగాధర్ ఏఎంసీ ఉపాధ్యక్షుడు అనిల్, డైరెక్టర్ శంకర్ కన్నం శ్రీనివాస్, కన్నం దావులయ కార్యకర్తలు ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పశువులను దొంగలిస్తున్న దొంగల ముఠా అరెస్ట్

- మహారాష్ట్రకు చెందిన వ్యక్తులే పశువుల దొంగలు
- వీరికి బోధన్ చెందిన కొందరు
- రెండు బొలెరోలు, ద్విచక్ర వాహనం స్వాధీనం
- ఏసిపి శ్రీనివాస్ రావు వెల్లడి



పత్రిక ప్రకటన



పోతంగల్/జూన్ 1/(జన సంఘర్షణ)

సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేయుచుండగా ఆ సమయంలో పోతంగల్ వైపు నుండి ఐదుగురు వ్యక్తులు రెండు బొలెరో వాహనాలు, ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ పైన వచ్చుచున్నారు. ఆ సమయంలో వారు పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, అప్పుడు పోలీసు వారు వారిని వెంబడించి పట్టుకొని విచారించగా వారు వారి యొక్క వివరాలు తెలియజేసినారు. ఏ-4. ఫరీద్ నవాబ్బాబ్ ఖురేషి, నివాసం: భాస్కరనగర్ బిలోలి, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం, ఏ-5. అస్లాం ఖురేషి సత్తార్ ఖురేషి, ఈద్గా గల్లీ బిలోలి, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం, ఏ -6. ఇలియాస్ నవాబ్ ఖురేషి, ఈద్గా గల్లీ బిలోలి, నాందేడ్ జిల్లా. మహారాష్ట్ర , ఏ-7.షేక్ రఫీక్ నవీపేట్ గ్రామం మండలం, ప్రస్తుతం శాస్త్రినగర్ ఆర్మూర్, నిజామాబాద్ జిల్లా. ఏ-8. మహమ్మద్ గేదెలను దొంగలించి ఖురేషి అబ్దుల్లా బోధన్ అనే వ్యక్తికి ఒక్కో దానికి సుమారు 7000 నుండి 8000 లకు అమ్ముకుంటున్నాడు. వారి వద్ద నుండి ఐదు సెల్ ఫోన్లు, రెండు బొలెరో వాహనాలు ఒక బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ ను స్వాధీనం పరుచుకున్నాము. వారిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అరె తిర్మట్పల్లి గ్రామం ఇందల్వాయి మండలం, నిజామాబాద్ జిల్లా, వారు మొత్తం 11 కేసులలో పశువులను కావాయ అమ్మేసినారు వారి వద్ద నుండి 20వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నాం. మిగతా డబ్బులు వారువారు చేసిన దొంగతనలు ఎ-1, సోహెల్ పటేల్, ని: నాందేడ్, మహారాష్ట్ర రాష్ట్రం, ఎ-2. సయ్యద్ సైఫ్, ని: బిలోలి, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం, ఎ-3. జియా ఖురేషి, బిలోలి, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం, ఎ -9 - అబుసద్. ఎ -10 డీల, ఎ -11- అబ్దుల్ అజీజ్ ని బోధన్ అను వారు పరారీలో ఉన్నారని ఎసిపి శ్రీనివాసరావు వెల్లడించారు.

## కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ముందు బీడీ కార్మికుల ధర్నా

- రాష్ట్రంలోని మహిళలందరినీ కోటీశ్వరులను చేస్తానంటూ రాష్ట్రంలోని బీడీ కార్మికులను కూటికి లేకుండా చేస్తున్న రేవంత్ రెడ్డి.

న్యూస్ కోటగిరి/ జూన్ 1/( జనసంఘర్షణ)






నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లోని ఎంపీడీవో కార్యాలయం ముందు బీడీలు చేసే కార్మికులందరికీ చేయూత పథకం ద్వారా 4వేల రూ:ల పింఛన్ ఇవ్వాలంటూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ) బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మహిళా బీడీ కార్మికులతో ధర్నా చేసి, ఎంపీడీవో కు డిమాండ్లతో కూడిన వినతి పత్రంతో పాటు బీడీ కార్మికుల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీ యూ సీ ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ లో అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మాకు ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన 100 రోజులలో నే పింఛన్లు రానటువంటి బీడీ కార్మికులందరికీ కట్ ఆఫ్ డేటును తొలగించి 4వేల రూపాయలు ఇస్తానని 2016 రూపాయలు వస్తున్నటువంటి వారికి కూడా 4000 రూపాయల కాడికి పెంచి ఇస్తానని హామీ ఇచ్చి నేటికీ రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఆ హామీని అమలు చేయక బీడీ కార్మికులకు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు రాష్ట్రంలో బీడీ పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు నెలలో 10, 12 రోజులకు సరిపడ కాకుండా సగం పని మాత్రమే యజమానులు పని కల్పించడంతో కూటికి లేక బీడీ కార్మికులు గోస పడుతుంటే, మన రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మహిళలందరినీ కోటీశ్వరులను చేస్తానంటున్నారని, ఇలాంటి మాటలతో మభ్య పెట్టకుండా వెంటనే బీడీ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం చేయూత పథకం ద్వారా 4000 రూపాయల పెన్షన్ వెంటనే ఇవ్వాలని లేనట్లయితే మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, బీడీ కార్మిక నాయకులు కళావతి, లక్ష్మి, గంగామణి, సావిత్రి, సునందలతో పాటు అధిక సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## బీసీ ఏ లోనికి మార్చాలి... నామినేటెడ్ పదవులు ఇవ్వాలని డిమాండ్

- జిల్లా అధ్యక్షులు బి.విఠల్ ముదిరాజ్.

కామారెడ్డి , జూన్ 1 ( జన సంఘర్షణ )

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే A GO MS NO 15 అమలులోకి తీసుకురావాలని, ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టు కోవాలని కోరినట్లు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి విఠల్ ముదిరాజ్ జిల్లా ఉపాధ్యక్షులు తూర్పు రాజు ముదిరాజ్ తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ లో ముదిరాజ్ జాతికి ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకొనేలా ఒత్తిడి పెంచాలని ,దీనితో యువతకు మేలు జరుగుతుంది డాక్టర్ బి విఠల్ ముదిరాజ్ స్పష్టం చేశారు. కనుక A GO MS NO 15 ను పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర యువజన , క్రీడల మంత్రి వాకటి శ్రీహరిని కలిసి బీసీ ఏ సాధన కోసం కామారెడ్డి డిక్లరేషన్ లో నాడు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నేటి ముఖ్యమంత్రి , నేతలు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి అతి పేదరికంలో ఉన్న ముదిరాజ్ జాతిని హక్కులను కల్పించాలని కోరినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవులు ఇచ్చి యువతను ప్రజా పాలనలో భాగస్వామ్యం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ జాతి నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బి.విఠల్ ముదిరాజ్ ఉపాధ్యక్షులు తూర్పు రాజు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. చైర్మెన్ ల నియామకం కోసం రాష్ట్ర యువజన , క్రీడల మంత్రి వాకటి శ్రీహరి కలిసి చర్చించామని చెప్పారు. కనీసం నియోజక వర్గానికి రెండు సొసైటీ లలో నైన పార్టీలో ఉన్న ముదిరాజ్ నాయకుల కు చైర్మెన్ పదవి కేటాయించి నామినేటెడ్ చేయాలని డిమాండ్ చేశారు. సరైన సమయంలో ముదిరాజ్ జాతి నాయకులు స్పందించక పోతే జాతికి, యువతకు తీవ్ర నష్టం జరుగు తుందని తెలిపారు. సీఎం కామారెడ్డి డిక్లరేషన్‌లో జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిరాజ్ జాతికి ఇచ్చిన హామీల వెంటనే అమలు చేసేలా ఒత్తిడి తెచ్చి హక్కులు సాధించు కోవాలని కోరినట్లు తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే హామీలు, నెరవేరుస్తామని చెప్పి రెండున్నరేళ్ల గడిచిపోయాయి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు లేక మరియు పార్టీలో 30-40 ఏండ్లుగా సొంత ఖర్చులతో ఎదురు నిలబడి కొట్లాడి పార్టీ ని అధికారంలో తీసుకురావడానికి త్యాగాలు చేసిన తర్వాత కూడా పార్టీ పదవులు ఇవ్వడం లేదని మంత్రి ముందు వాపోయారు . పరిస్థితులలో మార్పు రాకపోతే ఆందోళనకు దిగాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతికి నాయకుడిగా పట్టించుకొని న్యాయబద్ధంగా మాకు రావాల్సిన రాజకీయ పదవులను, పార్టీ పదవులను పార్టీలో పనిచేసే ముదిరాజ్ నాయకులకు ఇప్పించాలని



విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ జాతి కి రావాల్సిన న్యాయ మైన హక్కుల కోసం ప్రభుత్వం ద్వారా ఇప్పించడానికి కృషి చేస్తునని మంత్రి వాకటి శ్రీహరి ముదిరాజ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి నర్సింలు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా లో ఇచ్చిన మాట ప్రకారం బీపీ పేట్ మండల్ లో సీఎం రేవంత్ రెడ్డి ముద్రల సంబంధించిన మాట ప్రకారం బిసి ది నుంచి మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీబీపేట మండలంలో ఆయన ప్రకటన చేసినందుకు మాట విలువ పెట్టుకోవాలని ముదిరాజ్ సోదరులు కోరుతూ జరిగిందిఉద్యమకారుడు. శ్రీశైలం ముదిరాజ్, జగన్ ముదిరాజ్, సంజీవ్ యాదవ్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ కాలనీ ముఖద్వారం నిర్మాణం పూజా కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.

హైదరాబాద్ సిటీ, శేరిలింగంపల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):

శేరిలింగంపల్లి నియోజకవర్గం శంషిగూడ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీ ముఖద్వారం (కామన్) నిర్మాణం కొరకు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై కొబ్బరి కాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాల్, వెంకట్ నాయక్, అనురాధ, శ్యామ్, సురేష్, శివానంద్, శ్రీనివాస్, రమణ, జనార్ధన్, మురళి, మోహన్, రాజేందర్, పాండు, రాము, రాజ్ కుమార్, సత్తయ్య, ఏలియా, సుందర్, మల్లికార్జున్, రాజు, మేరీ, సునీత,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, కూకట్పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):
కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం కెపిహెచ్బి డివిజన్ లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ప్రధానంగా గతంలో నిధులు మంజూరూ అయ్యి జరుగుతున్న నూతన పైపు లైనులు ,రోడ్ల పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం హయాంలో కూకట్పల్లి నియోజకవర్గం లో కేపిహెచ్.బి డివిజన్ కు వందల కోట్ల నిధులు మంజూరు చేయించి నిరుపేదలకు ఉపయోగపడేటట్లు అనేక కార్యక్రమాలు నిర్వహించుకున్నామని ఇందులో ప్రధానంగా నాలుగో ఫేస్ లోఉంటున్న నిరుపేదలకు, ఇతర ప్రాంతాల వారికి ఉపయోగపడేటట్లుగా అత్యాధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని అడిగితే కాంగ్రెస్ నాయకుల దగ్గర తాళాలు ఉంచుకుని ఈ కమ్యూనిటీ హాల్ కు చెత్తా చెదారం,బూజులు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదా అభివృద్ధి, నిరుపేదలకు తక్కువ రుసుముతో వారికి శుభకార్యాలు చేసుకునే విధంగా దీన్ని ఉపయోగించాలని ఉద్దేశంతో కట్టించామని కనీసం అధికారులు కూడా కాంగ్రెస్ నాయకులకు భయపడి ఇలా ప్రజలకు ఉపయోగపడే ప్రాపర్టీలను నిర్వీర్యం చేస్తున్నారని, ఇప్పటికైనా ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. అలాగే మహిళా మండలి భవనం కూడా మహిళలకు ఉపయోగపడే విధంగా నిర్మించామని దాన్ని కూడా ఇదే స్థితిలో తీర్చిదిద్దారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో నిరుపేదలకు మంచినీరు ఇబ్బంది రాకుండా పైపు లైనులు వాటర్ ట్యాంకులు నిర్మించడమే కాకుండా ఉచిత మంచినీటిని అందించామని, ఇప్పుడు నీటి కొరతతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే పార్కులు, సిమ్మింగ్ పూల్స్ ఇండోర్ స్టేడియంలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటే కాంగ్రెస్ నాయకులు వాటన్నింటికీ బూజు పట్టించే ప్రయత్నం చేస్తున్నారని



కనీసం ప్రజల గురించి కూడా ఆలోచించడం లేదని.. తాను ఎప్పుడూ అభివృద్ధికి సహకరిస్తానని కానీ ఈ విధంగా చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, రాజేష్అ రాయ్, జున్ను సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, భారతి, అన్ని విభాగాల అధికారులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పగలు డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న కుర్రాడు.. రాత్రయితే అంతా కచోరీ వ్యవహారం!

విజయనగరం జిల్లా/జూన్ 1/(జన సంఘర్షణ)
పైకి చూస్తే చేతిలో పార్శిళ్లతో అమాయకంగా కనిపించే డెలివరీ బాయ్.. కానీ కట్ చేస్తే రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారం దోచుకునే గజదొంగ! పగటిపూట ఇళ్లను రెక్కీ చేస్తూ, రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్న ఒక కిలాడీ డెలివరీ బాయ్‌ను జిల్లా పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న ఒక బంగారు వ్యాపారిని కూడా పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం రొంపిల్లి గ్రామానికి చెందిన పువ్వల మణికంఠ ఒక ప్రముఖ ప్రైవేట్ ఆన్‌లైన్ డెలివరీ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా అతడు బొబ్బిలి, బాడంగి, సీతానగరం మండలాల్లోని వివిధ గ్రామాలకు తిరుగుతూ కస్టమర్లకు వస్తువులను డెలివరీ చేసేవాడు. ఈ క్రమంలోనే అతడి కన్ను గ్రామాల్లోని ఇళ్లపై పడింది. గ్రామస్థులు ఉదయం పూట వ్యవసాయ పనులకు, ఉపాధి హామీ పనులకు లేదా ఉద్యోగాలకు వెళ్లే సమయాలను అతడు నిశితంగా




గమనించేవాడు. ఏయే ఇళ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి, ఎవరెవరు ఏ సమయంలో ఇళ్లలో ఉండటం లేదు అనే విషయాలపై పక్కాగా స్కెచ్ వేసుకునేవాడు. 2023 నుంచి ఈ దారుణాలకు తెరలేపిన మణికంఠ.. తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ వరుస చోరీలకు పాల్పడటం మొదలుపెట్టాడు. ఇటీవల మెట్టవలస బస్టాప్ వద్ద మణికంఠ అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని పోలీసులు గమనించారు. అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు దొంగతనాల గుట్టు రట్టయింది. తాను దొంగిలించిన బంగారు ఆభరణాలను సాలూరుకు చెందిన బంగారు వ్యాపారి బాలేశ్వరరావుకు విక్రయిస్తున్నట్లు మణికంఠ అంగీకరించాడు. ఈ దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బును మణికంఠ విలాసాలకు, జల్సాలకు, చెడు వ్యసనాలకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు విచారణలో తేలింది.పోలీసులు వీరిద్దరినీ అరెస్టు చేసి, వారి వద్ద నుంచి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో జిల్లా పోలీసులు ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. గ్రామాల్లో లేదా కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. ఇళ్లను ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు నమ్మకస్థులకు చెప్పడం లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆన్‌లైన్ ఆర్డర్ల కోసం వచ్చే డెలివరీ బాయ్స్ ప్రవర్తనలో ఏమాత్రం తేడా ఉన్నా, అనుమానంవచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## తహసీల్దార్ ఎమ్మార్వోకి విద్యాలయ పనులు ప్రారంభించుటకు వినతి

మద్నూర్ మండలం,/జూన్ 1/(జన సంఘర్షణ)
విషయం: మద్నూర్‌లో కేంద్ర విద్యాలయ పనులు ప్రారంభించుటకు వినతి...
మద్నూర్ ప్రాంత ప్రజలు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మద్నూర్‌లో మంజూరైన కేంద్ర విద్యాలయ (కేంద్రీయ విద్యాలయ) పనులను వీలైనంత త్వరగా ప్రారంభించవలసిందిగా మేము వినమ్రంగా కోరుచున్నాము.ఈ విద్యాలయం ప్రారంభమైతే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో పాటు, వారి విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో ఎంతో ఆశాభావం ఉన్నందున సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయుటకు చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాము.అందువల్ల మా వినతిని పరిశీలించి, కేంద్ర విద్యాలయ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని మనవి. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల్ యువకులు తదితరులు పాల్గొన్నారు.



## కోటగిరి మండల కేంద్రంలో రాష్ట్ర తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కోటగిరి/జూన్ 1/(జన సంఘర్షణ)



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అనేది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం జూన్ 2న నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ పండుగ. హైదరాబాదుతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉత్సవాలు జరుగుతాయి. మండల స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు అందించడం జరుగుతుంది. కావున కోటగిరి మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం పక్కన జాతీయ జెండా ఆవిష్కరించున్నారు రేపు ఉదయం 9:30 గంటలకు కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపీటీసీలు గ్రామ సర్పంచులు, పాక్స్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు అందరూ రాగలరని మా యొక్క మనవి. ఇట్లు షాహిద్ హుస్సేన్, కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షులు అందరికి కార్యక్రమం విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా గోపు గంగాధర్ బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ ప్రతినిధి./జూన్ 1/(జన సంఘర్షణ)



బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయానికి నూతన కమిషనర్‌గా గోపు గంగాధర్ సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గోపు గంగాధర్ గతంలో భీంగల్ పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించగా, బదిలీపై బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయానికి కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని, పట్టణ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లకు గృహపవేశాలు

బీబీపేట్, జూన్ 1 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు సోమవారం, జూన్ 1న ప్రారంభమయ్యాయి. మండలంలోని 370 ఇళ్లలో 310 వివిధ దశల్లో ఉండగా, 184 స్లాబులు, 24 ఇళ్లు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ, తాసిల్దార్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికి 5 లక్షల రూపాయలు అందిస్తుంది. మిగిలిన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## పొతంగల్ నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్

పొతంగల్/జూన్ 1/(జన సంఘర్షణ)



పొతంగల్ మండల కేంద్రంలో నిన్నటి రోజున మంజీరా నదిలో అకస్మాత్తుగా నీటిలో మునిగి చనిపోయిన నిరుపేద కుటుంబానికి, చెందిన, కుర్మ గంగుండ, కుటుంబ సభ్యులకు బాన్సువాడ నియోజకవర్గ బిజెపి నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ స్థానిక బీజేపీ నాయకులు ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగింది వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసాని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో పోతంగల్ మండల బీజేపీ అధ్యక్షులు కల్లూరి హనుమాన్లు, మండల సీనియర్ నాయకులు పబ్బ శేఖర్, ఆలపాటి హరికృష్ణ, పత్తి సతీష్ మరియు బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ రాష్ట్రంలో పండగ వాతావరణంలో ఒక లక్ష ఇండ్ల గృహప్రవేశాలు

వర్ని/జూన్ 1/(జన సంఘర్షణ)



భారతదేశంలోనే తెలంగాణ ఒకే ఒక్క తెలంగాణ రాష్ట్రంలో జరగటం చాలా ఆనందదాయకం లక్ష ఇండ్ల యజమానుల కళ్ళల్లో ఆనంద భాష్పాల, ఆనందోత్సాహాల మధ్య బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో సాయంత్రం 6 గంటలకు పిసిసి డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజరెడ్డి, డిసీసీ కార్యదర్శి వెలగపూడి గోపాల్, సీనియర్ నాయకులు కళాల్, గిరి, అబ్దుల్ భారీ, తగిలేపల్లి గ్రామ సర్పంచి అల్లం సాయవ్వ, ఉప సర్పంచ్ ప్రసాద్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మైసన్ శీను, బక్క శంకర్, అల్లం సాయిలు, అబ్బాగౌడ్ దుబాయ్ రాములు, రమేష్, సంతోష్, గంగాధర్, మారుతి ప్రభాకర్ దర్శనం శంకర్, సాయిరాం, సాయిలు తగిలేపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి, ఆగ్రో చైర్మన్ బాలరాజుకి, డిసిసిబి మాజీ మాజీ అధ్యక్షులు పోచారం భాస్కర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.


## ప్రజల పక్షాన నిరంతరం ప్రశ్నించి, సమాజహితం కోసం అలుపెరుగని పోరాట యోధుడు ఉప్పల గోపాలరావు



హైదరాబాద్ సిటీ, కూకట్ పల్లి ప్రతినిధి అంజిబాబు, జూన్ 01, (జన సంఘర్షణ):
కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల జెశ్వంత్ రావు, దేశాల్ మిత్ర మండలి సభ్యులు తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, గంట శ్రీనివాసరావుతో కలిసి కేపీహెచ్‌బీ కాలనీ నెక్సస్ మాల్ ఎదురుగా ఉన్న ఇతిహాస్ రెస్టారెంట్ మంత్రా బ్యాంక్వెట్ హల్ లో జరిగిన ప్రజా ఆలోచన వేదిక రచయిత ఉప్పల గోపాలరావు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు.

# జల్లాపల్లి పాత ఊరు చెరువు నుంచి జోరుగా మట్టి, మొరం త్రవ్వకాలు






పోతంగల్/ జూన్ 1/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం జల్లా పల్లి పాత ఊరు చెరువు నుంచి ప్రతి రోజు పగలు రాత్రి అనే తేడా లేకుండా ముఖ్యంగా రాత్రి పూట జోరుగా మట్టి మొరం త్రవ్వకాలు చేస్తూ భారీరేట్లకు విక్రయాలు చేస్తుంటే ,వాల్టా చట్టం తూట్లు పడుతుందని, ఎవరు పట్టించుకోవడంలేదని, దీనిపై దృష్టి పెట్టాలని, ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట జోరుగా మట్టి ,మురం త్రవ్వకాలు చేస్తూ పగటి వరకు అవసరం ఉన్నవారికి అధిక రేట్లకు విక్రయాలు జోరుగా చేస్తున్నారని, దీనిపై ఎందుకు దృష్టి ఎవరు పెట్టడం లేదని, ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏ,యి తోపాటు పోతంగల్ ఎమ్మార్వోను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని, పంపిస్తామని సమాధానం ఇవ్వగా 100కు డయల్ చేయగా వారు కూడా పంపిస్తామని సమాధానం ఇచ్చారు.

# గ్రామదేవతల కృపా కటాక్షం ఉంటేనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయి..

- యాద్గార్ పూర్ గ్రామ వేద పండితులు శివశాస్త్రి పేర్కొన్నారు

యాద్గార్ పూర్/జూన్ 1/(జన సంఘర్షణ)

యాద్గార్ పూర్ గ్రామంలో గ్రామదేవతల ఆలయాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలను నేడు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు నిర్మించిన ఆలయాల మొదటి వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు గ్రామస్తులందరూ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు జరుపుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం యాద్గార్పూర్ గ్రామంలో గ్రామ దేవతల పండుగను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో గ్రామ దేవతలకు నూతనంగా నిర్మించిన ఆలయాల మొదటి వార్షికోత్సవ వేడుకలను మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజైన నేడు మహాలక్ష్మి ఆలయంలో శివ శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, నవగ్రహ పూజ, హోమము, పుణ్యాహవాచనము, పూర్ణాహుతి, అమ్మవారి అభిషేకము అలంకరణ హారతి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని ఆడపడుచులు మంగళహారతులతో స్థానిక చెరువు కట్ట వద్ద గల గంగమ్మ ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి గంగమ్మకు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ ర్యాలీలో ఏర్పాటు చేసిన డీజేలకు మహిళలు యువతను వేసిన స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారు, నల్ల పోచమ్మ, పెద్ద పోచమ్మ, గంగమ్మ తదితర గ్రామదేవతల ఆలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూజారి శివ శాస్త్రి మాట్లాడుతూ... గ్రామదేవతల కృపా కటాక్షం గ్రామం పై ఉంటేనే గ్రామం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. గ్రామ దేవతలకు గ్రామస్తులు నిత్యం పూజలు చేస్తూనే ఉండాలని సూచించారు. ప్రజలు భక్తి మార్గంలో నడిచినప్పుడు భగవంతుడు ఆశీర్వాదం ఉంటుందని చెప్పారు. ఇలాగే ఐకమత్యంగా ఉండు ముందు ముందు మరిన్ని పండగలు చేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షేక్ గౌస్, మాజీ సర్పంచ్ కృష్ణ, ఉపసర్పంచ్ లాలయ్య,గ్రామ పెద్దలు ఫుల్కంటి కిష్టయ్య, మెత్రి సాయిలు, గైని గంగారాం, సంఘం సంజీ వ్, దాదుసాబ్ చోటు, సయ్యద్, ఆంజనేయులు, శ్యామ్, ఆనంద్, శ్రీధర్, గడ్డం కృష్ణ, దొడ్ల కిష్టయ్య, సాయ గౌడ్, మైబూబ్ , హనుమంతరావు పటేల్, రాజు మహారాజ్, నాగరాజు, తదితరులు ఉన్నారు.






# అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మాఫియా

- కళ్ళ ముందు సాగుతున్న మట్టి మాఫియా అధికారులకు కనిపించదా?
- ఏ శాఖకు ఎంతెంత ముడుపులు?

కామారెడ్డి ప్రతినిధి/జూన్ 1/(జన సంఘర్షణ)

అధికారుల కళ్ళముందే ప్రకృతిని విచ్ఛిన్నం చేస్తుంటే అధికారులు చోద్యం చేస్తున్నారు. బాన్సువాడ, జూకల్, రెంజల్, నవీపేట్, ఎల్లారెడ్డి, గాంధారి, బీర్కూర్. పోతంగల్. రుద్రూర్, వర్ని, చందూర్, నిజామాబాద్, మల్కాపూర్, కామారెడ్డి మండలంలో విచ్చలవిడిగా చెరువులలో మట్టి త్రవ్వకాలు ప్రభుత్వం అనుమతి లేకుండా పగలు రాత్రి తేడా లేకుండా అధికార పార్టీ కీలక నేతల అండదండలతో భారీ ఎత్తున మట్టి మాఫియా చెలరేగిపోతుంది.చెరువులోని మట్టిని తీసుకువెళ్లి పొలాల్లో వేసుకుంటే ఆ భూమి సారవంతమగుతుందని వ్యవసాయ అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ కొంతమంది మట్టి మాఫియా చెలరేగిపోతున్నారు. నాలుగైదు జెసిబి లు చెరువులలో పెట్టి ట్రాక్టర్ కు 500 నుంచి 1500 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. పొలాల్లో వేసుకోవాల్సిన ఈ మట్టిని కొంతమంది ఇటిక బట్టీలకు, మరి కొంత మంది వెంచర్లకు తరలిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒకపక్క జూదం, మరొక పక్కా హత్యలు, ఇంకొక వైపు దొంగతనాలు, ఇది కాకుండా మొరం మాఫియా, ఇసుక మాఫియా, మట్టి మాఫియా కొనసాగుతుంది. స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం లేకుండానే సిసిఎస్ ఎసిపి మస్తాన్ అలీ చీతా ఫోర్స్ త దాడులకు పాల్పడడంతో కొంతమంది గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఇప్పటికే సీతా ఫోర్స్ వ్యభిచార గృహాలపై, పిడిఎఫ్ బియ్యం తరలిస్తున్న లారీలపై, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలపై దాడులు నిర్వహిస్తూ ఎంతో కొంత ఫలితాలు రాబడుతున్నారు. స్థానికంగా ఉన్న పోలీసులు వారికి ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతుందో అన్నీ తెలిసినప్పటికీ వారు ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వకుండా వారు ఇచ్చే లంచాలకు అలవాటు పడిపోతున్నారు. పోలీసుల కాదు కొంతమంది పోలీస్ బాసులు కూడా అవినీతికి చోటు కల్పిస్తున్నారు. ఇటీవల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీసులు బాసులు ఏసీబీకి పట్టుబడ్డ సంఘటనలే నిదర్శనం. ఇది ఇలా ఉండగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విచ్చలవిడిగా చెరువులలో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. చెరువులో మట్టి తీస్తే భవిష్యత్తు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో అన్న భయాందోళన ప్రజలు వెల్లడిస్తున్నారు.





# వృద్ధురాలు కనిపించడం లేదు



జానకంపేట్/జూన్ 1/(జన సంఘర్షణ)

ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామానికి చెందిన ఉప్పు పోసాని అనే వృద్ధురాలు సాయంత్రం నుండి కనిపించడం లేదు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుండి బయటకు వెళ్లిపోయారు. మేము సాయంత్రం నుండి ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ వృద్ధురాలిని ఎవరైనా ఎక్కడైనా గమనించినా లేదా ఆమె ఆచూకీ గురించి సమాచారం తెలిసినా దయచేసి వెంటనే క్రింది ఫోన్ నంబర్‌కు సమాచారం తెలియజేయగలరు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: ఉప్పు శ్రీనివాస్ ఫోన్ నంబర్ : 9951205808 .. సంప్రదించవలసిన కోరుతున్నాం.

# ఎత్తోండ గ్రామంలో తెలంగాణ ఆవిర్భా దినోత్సవం వేడుకలు



కోటగిరి/జూన్ 1/(జన సంఘర్షణ)

మంగళవారం ఉదయం 8 గంటలకు మన గ్రామ పంచాయతీ వద్ద ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేత సూర్యకాంత్ జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. కావున గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు ఎత్తోండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామ పెద్దలు అందరూ రాగలరని మా యొక్క మనవి. ఇట్లు శ్వేత సూర్యకాంత్ ఎత్తోండ గ్రామ సర్పంచ్ కోరుతున్నాం.

# అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- లబ్ధిదారులతో గృహప్రవేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి /జూన్ 1/(జన సంఘర్షణ)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్ల గృహప్రవేశాల మహోత్సవం సోమవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అడ్లూరి ఎస్సీ కాలనీ, వార్డు నంబర్-2లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణిలతో కలిసి లబ్ధిదారులు పెరుమాళ్ల లింగం, ఎల్లవ్వల నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో, కామారెడ్డి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సహకారంతో సొంత ఇంటి కలను సాకారం చేసుకున్న లబ్ధిదారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. గృహ నిర్మాణాలను విజయవంతంగా పూర్తిచేసుకుని గృహప్రవేశం నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నమస్కారం



పోతంగల్/జూన్ 1/(జన సంఘర్షణ)

మంగళ వారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవశీ సందర్భంగా మీ అందరికి ముందస్తు శు భాకాంక్షలు....ఉదయం 9-00గంటలకు పోతంగల్ మండల బస్టాండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం గలదు. కావున మండల ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ విజ్ఞప్తి నమస్కారం. ఇట్లు, మీ పుప్పాల శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతంగల్. ఈ కారు అందరూ కలిసి విజయంతం చేయాలని కోరుతున్నాం.

# నిజామాబాద్‌లో విషాదం

- పిడుగుపాటుకు గురై మహిళ మృతి



నిజామాబాద్ బ్యూరో /జూన్ 1/(జన సంఘర్షణ)

పొలం పనుల్లో నిమగ్నమైన ఓ మహిళపై పిడుగు పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలంలోని తడపాకల్ గ్రామంలో సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన తాతల్ల సునీత (28) వరి చేనులో కూలి పనులకువెళ్లింది. వరి పంటకు ఎరువు చల్లుతున్న సమయంలోమధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు సంభవించాయి. ఈ క్రమంలో సునీత పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బోధన్: కార్బైడ్‌తో పండ్లు మగ్గించిన వ్యాపారికి నెల జైలు శిక్ష



బోధన్/జూన్ 1/(జన సంఘర్షణ)

బోధన్‌లో కృతిమంగా (కాలిషయం కార్బైడ్‌తో) నారింజ పండ్లన మగ్గపెట్టి కృతిమంగా విక్రయిస్తున్నా వ్యాపారికి కోర్ట్ నెల రోజులు జైలు శిక్ష రూ,, 5,000 వేల జరిమాన విధించిందని బాసరా, జోనల్ అధికారి, సహాయ ఆహార నియంత్రణాధికారి టీ. నాయక్ తెలిపారు. బోధన్ ఓల్డ్ బస్టాండ్ వద్ద ఉన్న ఫ్రూట్ మర్చంట్, యజమాని మహమ్మద్, మునవర్, ఉద్దీన్ నారింజ పండ్లను కృతిమంగా మగించి విక్రయిస్తున్నారని నేరం రుజు వైందన్నారు.

## జూన్ 1 నుంచి 15 వరకు నిబంధనలు అమలు: సీపీ



నిజామాబాద్ ప్రతినిధి/జూన్ 1/(జన సంఘర్షణ)

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పరిధిలో జూన్ 1 నుంచి 15 వరకు ప్రత్యేక నిబంధనలు అమలులోకి ఉంటాయని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. విగ్రహాలు, ప్రతిష్టాపన, డిజె సౌండ్ బాక్స్ ఊరేగింపులు, డ్రోన్స్, వినియోగం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి అంశాలపై ఆకాంక్ష విధించినట్టు పేర్కొన్నారు నిబ్బందులను ఉల్లంఘించిన అయితే వారిపై చట్టరిధ్యమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# బాబాయ్ ఇంట్లో చోరీ.. ముగ్గురి అరెస్టు




ఆర్మూర్/జూన్ 1/(జన సంఘర్షణ)

ఆర్మూర్‌లో దొంగతనం కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు సిపి సాయి చైతన్య వెల్లడించారు. ఈనెల 24న మా లక్ష్మి కాలింగ్‌లో నిందితుడు విజయ్ అగర్వాల్ తన బాబోయ్ ఇంట్లో చోరికి పాల్పడ్డారు. 41.43 లక్షల విలువైన బంగారు వెండి నగదు దొంగిలించారు. విజయ, అగర్వాల్ , సల్మాన్ ఖాన్, సాయికుమార్ను, అరెస్టు చేయగా మరో నిందితుడు శ్రీహరి పరార్ లో ఉన్నాడు. వారి నుంచి రూ, 31,48 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసినట్టు సిపి సాయి చైతన్య చెప్పారు.

# ఏ ఒక్క పేదోడు గుడిసెలో ఉండకూడదు: సీఎం



అదిలాబాద్/జూన్ 1/(జన సంఘర్షణ)

టీజీ హైదరాబాద్ రాష్ట్రం ఇందిరమ్మ ఇండ్లు రాజ్యంలో పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క గూడెంలో కూడా గుడిసె ఉండేందుకు వీల్లేదు జీతాలు పెన్షన్లు ఇవ్వడానికి కష్టంగా ఉన్న ఇందిరమ్మ ఇల్లు బిల్లులను మాత్రం ఆపలేదు. 1.20 లక్షలు ఇల్లు పూర్తి చేసిన 100% డబ్బులు జమ చేసాం సెప్టెంబర్‌లో మరో లక్ష గృహప్రవేశాలు చేసుకుందాం అని కాగజ్ నగర్ సభలో సీఎం చెప్పారు.

## ప్రభుత్వ పథకాలతో పేదల ఇళ్ల కల సాకారం



**ప్రజావారధి :**
జహీరాబాద్ మండలం శేకాపూర్ గ్రామంలో సోమవారం సాయంత్రం 'ఇందిరమ్మ గృహప్రవేశాల' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్ రెడ్డి, ఎంపీడీవో మహేందర్ రెడ్డి మరియు జహీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను అందజేసి, అధికారులు గృహప్రవేశాలను లాంఛనంగా ప్రారంభించారు. సొంత ఇల్లు లభించడంతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముభీన్, కౌన్సిలర్ జమీల్ ఉద్దీన్, శ్రీధర్ రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శ కాలనీ - ఆదర్శ దంపతులకు ఘన సన్మానం



**హన్మకొండ**
ఆదర్శ కాలనీ వాసులైన ఆదర్శ దంపతులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, రాష్ట్ర అవార్డు గ్రహీత వెలిదండి సుమలతలకు ఘనసన్మానం జరిగింది. శనివారం రాత్రి హనుమకొండలోని పాపడం కన్వెన్షన్ హాలులో గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు వెంగళమురళి పదవీ విరమణ మహోత్సవం సందర్భంగా "దీవెన" విద్యా వికాస కార్యక్రమాలలో సేవలు అందించిన వారికి జరిగిన సన్మాన కార్యక్రమం సందర్భంగా విద్యా, సామాజిక సేవా రంగాలలో వేణు, సుమలతలు అందిస్తున్న సేవలకు గాను, హనుమకొండ విద్యాశాఖ అధికారి గిరిరాజ్ చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు మాట్లాడుతూ విద్య సామాజిక సేవా రంగాలలో సేవలందిస్తున్న వారిని సమాజం గుర్తించి ఈ విధంగా సన్మానించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ సుమాదేవి, సెక్టోరియల్ అధికారి మహేష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వెంగళమురళి, సరస్వతీభట్ల రామకృష్ణ, ఉపాధ్యాయుని మాధవి, థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ సభ్యులు, ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్ సభ్యులు, వెల్ విషర్స్ సభ్యులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న అశోక్ నగర్ సర్పంచ్ జరపలా దేవి

**కొత్తగూడెం :**




లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్ నగర్ కాలనీ పంచాయతీలో ఇంది రమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిపిఐ పార్టీ సర్పంచ్ జర్పల దేవి, పంచా యతీ కార్యదర్శి చింతల ప్రవీణ్ కుమార్, తో కలిసి నూతన గృహం ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయో జనాలు అందేలా కృషి చేస్తున్నా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల సంధ్య, వార్డు సభ్యులు, లబ్ధిదారులు మిట్టపల్లి శిరీష, ధారావత్ స్రవంతి, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించబడుతోందని, దీంతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వైభవంగా శ్రీబీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం

**-స్వామివారి ఆశీస్సులు పొందిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి,ప్రజాప్రతినిధులు**



**పీర్జాదిగూడ :**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడలో నిర్వహించిన శ్రీబీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడగా, భక్తి గీతాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణోత్సవ వేడుకలు ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ప్రాంత ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. అలాగే మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, శ్యామల శ్రీనివాస్, ఆకుల మధుకర్, ప్రవీణ్‌తో పాటు కురుమ సంఘం ప్రతినిధులు మరియు పలువురు సామాజిక, రాజకీయ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కురుమ సంఘం ప్రతినిధులు అతిథులకు స్వాగతం పలికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ప్రతి ఏడాది నిర్వహించే శ్రీ బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం ప్రాంతీయంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ఆధ్యాత్మిక వేడుకగా గుర్తింపు పొందింది. ఈ వేడుకల్లో పాల్గొనడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ మహోత్సవం భక్తుల ఉత్సాహం మధ్య విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భక్తుల కోరికలు నెరవేరాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ బీరప్ప స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# గిన్నిస్ ప్రపంచ రికార్డులో భీమారం విద్యార్థుల అరుదైన ఘనత

**కీబోర్డ్ వాయిద్యంలో అసాధారణ ప్రతిభ ప్రదర్శించి అంతర్జాతీయ గుర్తింపు**

**హనుమకొండ :**
ప్రపంచ వేదికపై తమ సంగీత ప్రతిభను చాటుతూ హనుమకొండ జిల్లా భీమారం ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు గిన్నిస్ ప్రపంచ రికార్డులో స్థానం సంపాదించి జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న విక్టరీ ఆడిటోరియంలో నిర్వహించిన 'గిన్నిస్ అచీవర్స్ మీట్' (సాధకుల సమ్మేళనం) విశేష ఆదరణ పొందింది. గిన్నిస్ ప్రపంచ రికార్డుల ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 22 దేశాలకు చెందిన సుమారు 2,000 మంది కీబోర్డ్ వాద్యకారులు పాల్గొని గంటపాటు నిరంతరాయంగా కీబోర్డ్ వాయిస్తూ తమ సంగీత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రతిష్ఠాత్మక




కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 777 మంది విద్యార్థులను గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధకులుగా ఎంపిక చేశారు. సంగీత విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టిన్ దాండింగి విజేతలకు స్వయంగా ధృవపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ గౌరవనీయ జాబితాలో భీమారం ప్రాంతానికి చెందిన డేనియల్ కృపాల్ చౌహాన్, డెబోరా కీర్తి చౌహాన్ చోటు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. డేనియల్ కృపాల్ చౌహాన్ స్కిల్ స్టోర్క్ ఇంటర్నేషనల్ స్కూల్లో 5వ తరగతి, డెబోరా కీర్తి చౌహాన్ అదే విద్యాసంస్థలో 10వ తరగతి అభ్యసిస్తున్నారు. చిన్న వయస్సులోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ విద్యార్థులను గ్రామ పెద్దలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సుజాత చౌహాన్, జగధీర్ చౌహాన్ (దీూచీూ) అభినందించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి మెరుగులు దిద్దిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం సేవలు అభినందనీయమని కొనియాడారు. గిన్నిస్ ప్రపంచ రికార్డులో చోటు దక్కించుకోవడం ద్వారా ఈ విద్యార్థులు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి ఉన్నత శిఖరా లను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. విద్యతో పాటు సంగీత రంగంలోనూ రాణిస్తూ భీమారం ప్రాంతానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చిన ఈ విద్యార్థుల విజయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విశ్వబ్రాహ్మణ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

**హనుమకొండ/ :**
విశ్వబ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (వోపా) వరంగల్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇచ్చే ప్రతిభా పురస్కారాలకు విశ్వబ్రాహ్మణ విద్యార్థిని,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు, ప్రతిభా పురస్కారాల కన్వీనర్, వోపా అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ రెడ్డి కాలనీ లోని వోపా కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో చర్చించి పై నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. 2026 సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విశ్వబ్రాహ్మణ విద్యార్థినీ,విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవా లన్నారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు, మార్కుల సర్టిఫికెట్,బోనఫైడ్ లేదా కండక్ట్ సర్టిఫికెట్,క్యాస్ట్ సర్టిఫికెట్,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు 9440313745 నెంబర్ కు వాట్సాప్ ద్వారా ఈ నెల 10 వరకు పంపాలన్నారు. గడువులోగా అందిన దరఖాస్తులలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందించి శాలువాతో ఘనంగా సత్కరించునున్నట్లు వారు తెలిపారు. అవసరాన్ని బట్టి ప్రోత్సాహక బహుమతులు కూడా ఇవ్వబడతాయని, ప్రతిభా పురస్కారాల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమన్నారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపి



కైన విద్యార్థుల వివరాలు, పురస్కారాలు ఇచ్చే తేదీ, వేదిక త్వరలో వెల్లడించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వోపా రాష్ట్ర ముఖ్య సలహాదారులు చోల్లేటి కృష్ణమాచార్యులు గారు, వోపా ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులు సంగోజు మోహన్,ఉపాధ్యక్షులు ఆకోజు సురేందర్ రావు, కోశాధికారి శ్రీరామోజు వెంకటేశ్వర్లు, బాధ్యులు శ్రీరామోజు నాగసోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక్ నగర్‌లో రూ.60 లక్షలతో డ్రైనేజీ పనులు వేగవంతం

**-పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్ :**
ఉప్పల్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని స్థానిక ప్రజలతో కలిసి ఆమె సమీక్షించారు. ఇటీవల కాలనీలో పర్యటించిన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించామని, ప్రస్తుతం డ్రైనేజీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. మొత్తం రూ.60 లక్షల నిధులతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న మురుగునీటి



సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభానికి ముందే డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు. అలాగే త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించి వినాయక్ నగర్‌ను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. "ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాం. కాలనీల అభివృద్ధే



మా ప్రధాన లక్ష్యం" అని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు బకారం లక్ష్మణ్, బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి, అలుగుల అనీల్ కుమార్, తోకట రాజు, కంచర్ల శ్రీను, నాగరాజు, కుందానపల్లి బాలరాజు, కుందానపల్లి రాజు, సింగారం వెంకటేష్, కుందానపల్లి భాగ్య, సింగారం అండాలు, మామిళ్ల పుష్ప, మామిళ్ల మధు, కుందానపల్లి నరేందర్, యాకరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ యువ ఆవిష్కర్త వరుణ్ అనీష్ రెడ్డి యెరువకు అంతర్జాతీయ గుర్తింపు

**-ఏఐ ఆధారిత వర్క్‌ఫ్లో మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు పేటెంట్ సాధించి విశిష్ట ఘనత**

**-అమెజాన్‌లో ఐటీ ప్రొఫెషనల్‌గా సేవలు అందిస్తున్న తెలంగాణ యువకుడి ప్రతిభకు ప్రపంచ స్థాయి ప్రశంసలు**



**ఉప్పల్ :**
తెలంగాణకు చెందిన యువ ఆవిష్కర్త, అమెరికాలోని ప్రముఖ సాంకేతిక సంస్థ అమెజాన్‌లో ఐటీ ప్రొఫెషనల్‌గా పని చేస్తున్న వరుణ్ అనీష్ రెడ్డి యెరువ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను సాధించారు. "Adaptive Work flow Execution Control System Using Hybrid Rule-Based and Artificial Intelligence Decision Fusion with Dynamic Weighting" అనే వినూత్న సాంకేతిక ఆవిష్కరణకు పేటెంట్ పొందడం ద్వారా ఆయన తన ప్రతిభను మరోసారి చాటిచెప్పారు. ఈ విజయంతో తెలంగాణ యువత సాంకేతిక రంగంలో ప్రపంచ వేదికపై తమ సత్తాను చాటగలదని నిరూపించారు. వరుణ్ అనీష్ రెడ్డి యెరువ, శ్రీ విజయ్ కుమార్ రెడ్డి యెరువ, శ్రీమతి జయంతి రెడ్డి దంపతుల కుమారుడు. విద్యార్థి దశ నుంచే సాంకేతిక రంగంపై ఆసక్తి పెంచుకున్న ఆయన, Delhi Public School, Gachibowli లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. అనంతరం GITAM University నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందారు. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఆయన, Northern Illinois University లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి సాంకేతిక రంగంలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరించారు.

**ఏఐ, రూల్-బేస్డ్ వ్యవస్థల సమన్వయంతో విప్లవాత్మక ఆవిష్కరణ**

వరుణ్ అభివృద్ధి చేసిన ఈ పేటెంట్ డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ వాతావరణాల్లో వర్క్‌ఫ్లో నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు రూపొందించబడింది. సంప్రదాయ రూల్–బేస్డ్ నిర్ణయ వ్యవస్థలను కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రిడిక్టివ్ అనలిటిక్స్‌తో సమన్వయం చేయడం ద్వారా వర్క్‌ఫ్లో అమలు, వనరుల కేటాయింపు, టాస్క్ షెడ్యూలింగ్, పరస్పర ఆధారిత ప్రక్రియల నిర్వహణ వంటి అంశాలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించే విధంగా ఈ వ్యవస్థ రూపొందించబడింది. ఈ ఆవిష్కరణలో అత్యంత కీలక భాగంగా ఉన్న మెటా–డెసిషన్ కంట్రోలర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇది రూల్–బేస్డ్ అవుట్‌పుట్‌లను, ఏఐ ఆధారిత అంచనాలను డైనమిక్ వెయిటింగ్ విధానంతో సమన్వయం చేస్తూ అత్యుత్తమ నిర్ణయాలను తీసుకునేలా వ్యవస్థను నడిపిస్తుంది. వర్క్‌ఫ్లో పనితీరును నిరంతరం విశ్లేషిస్తూ, నిర్ణయాల్లో వచ్చే విభేదాలను పరిష్కరించడం, అమలు పరామితులను స్వయంచాలకంగా సర్దుబాటు చేయడం ద్వారా గరిష్ట సామర్థ్యం, స్థిరత్వాన్ని ఈ వ్యవస్థ నిర్ధారిస్తుంది.

**క్లౌడ్ కంప్యూటింగ్ రంగానికి కొత్త దిశ**

ఈ సాంకేతికత ద్వారా వర్క్‌ఫ్లో అమలులో స్థిరత్వం పెరగడంతో పాటు పనితీరులో వచ్చే హెచ్చుతగ్గులను తగ్గించవచ్చు. ముఖ్యంగా పెద్ద స్థాయి కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల్లో సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్ (SLAs) అమలును మరింత మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది. క్లౌడ్ కంప్యూటింగ్, ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవస్థలు, తదుపరి తరం డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో ఈ ఆవిష్కరణ విస్తృత స్థాయిలో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని సాంకేతిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**తెలంగాణకు గర్వకారణం**

ప్రపంచ స్థాయి సాంకేతిక రంగంలో పేటెంట్ సాధించడం ద్వారా వరుణ్ అనీష్ రెడ్డి యెరువ పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి పట్ల తన అంకితభావాన్ని మరోసారి నిరూపించారు. ఆయన సాధించిన ఈ విజయం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలవడమే కాకుండా, యువ ఇంజినీర్లు, పరిశోధకులు, ఆవిష్కర్తలకు స్ఫూర్తినిచ్చే మైలురాయిగా నిలిచింది. సాంకేతిక రంగంలో మరిన్ని వినూత్న ఆవిష్కరణలతో ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్టను మరింత పెంచాలని ఆకాంక్షిస్తూ, ఈ విశిష్ట విజయాన్ని సాధించిన వరుణ్ అనీష్ రెడ్డి యెరువకు పలువురు ప్రముఖులు, సాంకేతిక నిపుణులు అభినందనలు తెలియజేస్తున్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co